## క్లుప్తంగా

### రేపు మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

**రామచంద్రపురం:** మున్సిపల్ సాధారణ సమావేశం స్థానిక మున్సిపల్ కౌన్సిల్ హాల్‌లో బుధవారం నిర్వహిస్తున్నట్టు చైర్‌పర్సన్ గాదంశెట్టి శ్రీదేవి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటలకు నిర్వహించే ఈ సమావేశానికి కౌన్సిల్ సభ్యులు, కో-ఆప్షన్ మెంబర్లు, అధికారులు హాజరుకావాలని విజ్ఞప్తి చేశారు.

### కౌలు రైతులకు కార్డులు ఇవ్వాలి



డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

**రాయవరం:** దేవస్థానం భూములను కౌలుకు చేసే రైతులకు కౌలురైతు కార్డులు ఇవ్వాలని బీజేపీ నేతలు డిమాండ్ చేశారు. ఈ మేరకు పార్టీ ప్రతినిధులు చాట్రాతి జానకిరాంబాబు, నరాల రాంబాబు, చిరట్ల సుబ్బారావు తదితరులు తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం వినతిపత్రం అందజేశారు. గత ప్రభుత్వంలో కౌలు రైతులకు కార్డులు ఇచ్చేవారని, కానీ ప్రస్తుత ప్రభుత్వంలో దేవస్థానం భూములను కౌలుకు చేసే రైతులకు కౌలు రైతు కార్డులు ఇవ్వడం లేదన్నారు. దీనివల్ల కౌలు రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. దేవస్థానం భూములను కౌలుకు చేసే రైతులకు కౌలురైతు కార్డులు ఇచ్చేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలంటూ వారు డిప్యూటీ తహసీల్దార్ జానకిరామయ్యకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో పలువురు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

### చంటిబాబుకు ఎమ్మెల్సీ తోట పరామర్శ



చంటిబాబును పరామర్శిస్తున్న ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు తదితరులు

**రాయవరం:** గుండె సంబంధిత శస్త్ర చికిత్స అనంతరం విశ్రాంతి తీసుకుంటున్న వైఎస్సార్ సీపీ నేత పడాల చంటిబాబును ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు సోమవారం పరామర్శించారు. చంటిబాబు ఆరోగ్య పరిస్థితిని ఆరా తీశారు. ఎమ్మెల్సీ త్రిమూర్తులతో పాటు, సర్పంచ్ చంద్రమళ్ల రామకృష్ణ, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ తేతల సుబ్బారామారెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు తమలంపూడి గంగాధరరెడ్డి, ప్రముఖ వైద్యులు డాక్టర్ తేతల నవీన్‌రెడ్డి, వి.సావరం ఉప సర్పంచ్ వెలగల సత్యనారాయణరెడ్డి, స్థానిక నేతలు చంటిబాబును పరామర్శించారు.

### బాధిత కుటుంబాలకు మంత్రి ఆర్థిక సాయం



కాపవరంలో తరుణ్‌కుమార్ తల్లికి ఆర్థిక సాయం అందిస్తున్న మంత్రి సుభాష్

**రామచంద్రపురం రూరల్:** మండలంలోని పలు బాధిత కుటుంబాలకు రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ సోమవారం ఆర్థిక సాయం అందించారు. కాపవరంలో ఇటీవల ట్రాక్టర్ ప్రమాదంలో మృతి చెందిన సిద్దాల తరుణ్‌కుమార్ తల్లి, సోదరిని పరామర్శించారు. తల్లికి రూ.10 వేలు అందించారు. ఇటీవల రెండు కాళ్లకు ఆపరేషన్ చేయించుకున్న అదే గ్రామానికి చెందిన చల్లా భీమశంకర్‌కు రూ.10 వేల సాయం చేశారు. ఎనిమిది నెలలుగా కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న ఆదివారపుపేట గ్రామానికి చెందిన అల్లక కృష్ణంరాజుకు రూ.20 వేల ఆర్థిక సాయం అందించారు.

### వృద్ధుడిని బోటుపై తరలించిన ఎన్‌డీఆర్‌ఎఫ్



ఊడిమూడిలంక నుంచి వృద్ధుడిని బోటులో తీసుకువస్తున్న ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందం

**పి.గన్నవరం:** ఊడిమూడిలంకలో అనారోగ్యంతో బాధపడుతున్న ఓ వృద్ధుడిని ఎన్‌డీఆర్‌ఎఫ్ దళాలు సోమవారం సాయంత్రం వరద ఉధృతిలో బోటుపై బెల్లంపూడి గ్రామానికి తీసుకు వచ్చాయి. అక్కడి నుంచి రెవెన్యూ అధికారులు 108 అంబులెన్స్‌లో అతడిని పి.గన్నవరం సీహెచ్‌సీకి తరలించారు. ఊడిమూడిలంకకు చెందిన పిట్టా నారాయుడు ఏడాదిగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. సోమవారం అతడి ఆరోగ్యం క్షీణించింది. నడవలేని స్థితిలో ఉండడంతో, ఈ విషయాన్ని కుటుంబ సభ్యులు వీఆర్వోలు కె.భగవాన్, ఎస్.దుర్గాప్రసాద్‌కు తెలిపారు. వారు అధికారులతో మాట్లాడి ఎన్‌డీఆర్‌ఎఫ్ బోటు ద్వారా బెల్లంపూడికి తరలించారు.

# జనానికి పరేషన్

- ఇంటింటికీ రేషన్ పథకంలో మంత్రి వ్యాఖ్యలపై సర్వత్రా మండిపాటు
- జగన్ ప్రవేశపెట్టిన రేషన్ పంపిణీ పథకానికి ప్రజల మెప్పు
- కొత్త ప్రభుత్వ తీరుపై అనుమానాలు



పడమర ఖండ్రికలో ఇంటి వద్ద సరకులు అందజేస్తున్న సిబ్బంది

**కపిలేశ్వరపురం:** పేదల పక్షపాతి అయిన వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి 2019 ఎన్నికల్లో అఖండ మెజార్టీతో గెలిచి ఐదేళ్లు సంక్షేమ పాలనను అందించారు. తాజా ఎన్నికల్లో విపక్ష నేతలు కూటమిగా కుమ్మక్కై, అమలు సాధ్యం కాని హామీలతో ప్రజలను మభ్యపెట్టారు. గత ప్రభుత్వ సంక్షేమ పథకాలను దూషించిన కూటమి నేతలు.. అంతకంటే ఎక్కువ సంక్షేమాన్ని అందిస్తామంటూ నోటికొచ్చిన వాగ్దానాలు గుప్పించారు. అధికారం చేపట్టాక అప్పులను సాకుగా చూపిస్తూ సంక్షేమ పథకాలను ఎగ్గొట్టే ప్రయత్నాలు చేస్తున్నారు. రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ఇటీవల ఇంటింటికీ రేషన్ పథకం మూర్ఖపు ఆలోచన అని, దానిపై చర్చించి నిర్ణయం తీసుకుంటామంటూ చేసిన ప్రకటనపై ప్రజల్లో తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోంది. దీంతో రేపటి నుంచి ప్రజా పంపిణీ సరకులు ఎలా సరఫరా చేస్తారోనని సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది.

**మండపేట, రామచంద్రపురం నియోజకవర్గాల్లో రేషన్ పంపిణీ ఇలా..**

| మండలం | రేషన్ షాపులు | ట్రక్కులు | కార్డులు |
|---|---|---|---|
| మండపేట | 64 | 34 | 43,029 |
| రాయవరం | 41 | 13 | 21,059 |
| కపిలేశ్వరపురం | 42 | 18 | 21,806 |
| రామచంద్రపురం | 58 | 24 | 34,420 |
| కె.గంగవరం | 43 | 15 | 20,602 |
| కాజులూరు | 45 | 15 | 22,821 |
| మొత్తం | 293 | 119 | 1,63,737 |

**ప్రయోజనం ఇలా..**

మండపేట నియోజకవర్గంలో 147 షాపుల పరిధిలో 65 వాహనాల ద్వారా 85,894 కుటుంబాలకు సరకులను పంపిణీ చేస్తున్నారు. రామచంద్రపురం నియోజకవర్గంలో 146 షాపుల పరిధిలో 54 వాహనాల ద్వారా 77,843 కుటుంబాలకు సరకులు సరఫరా అవుతున్నాయి.

**పథకం లక్ష్యమిదీ..**

వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి కాగానే ఇంటింటికీ రేషన్ సరకులు పంపిణీ పథకానికి రూపకల్పన చేశారు. మొబైల్ డిస్పెన్సింగ్ యూనిట్ (ఎండీయూ) ద్వారా ప్రజా పంపిణీలో నవ శకానికి నాంది పలికారు. పేదలకు దూరాభారం, నిరీక్షణ అవస్థలకు స్వస్తి పలుకుతూ 2021 జనవరి 21న వాహనాలను అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభించారు. ఫిబ్రవరి ఒకటిన రాష్ట్రంలో 12 పట్టణాల్లో పంపిణీ ప్రారంభమైంది. స్థానిక సంస్థల ఎన్నికల నోటిఫికేషన్ ముగియడంతో, ఫిబ్రవరి 23 నుంచి గ్రామాల్లో పంపిణీ ప్రారంభమైంది. జిల్లాలో 2,659 రేషన్ దుకాణాల పరిధిలో 16.34 లక్షల రేషన్ కార్డు లబ్ధిదారులకు 9,260 వాహనాల ద్వారా సరకులను ఈపోస్ యంత్రం ద్వారా జీపీఎస్ ట్రాకింగ్ పద్ధతిలో పంపిణీ చేశారు. మొత్తం పంపిణీ కార్యక్రమాన్ని సెంట్రల్ కమాండ్ కంట్రోల్‌తో పర్యవేక్షించారు. మైదాన ప్రాంతాల్లో లంక గ్రామాల ప్రజలు, దళితవాడలు, గిరిజన ప్రాంతాల్లో వాహనాల ద్వారా పంపిణీ జరిగింది. నూతన పథకం వచ్చిందని రేషన్ డీలర్ల వ్యవస్థను నిర్వీర్యం చేయకుండా, ఎండీయూలకు సరకులను సరఫరా చేసే బాధ్యతలను డీలర్లకు అప్పగించారు.

**బాధ్యతారాహిత్యంగా మంత్రి వ్యాఖ్యలు**

పౌర సరఫరాల శాఖ మంత్రి తీరు ఆడలేక మద్దెల ఓడు అన్నట్టుగా ఉంది. ఆర్థిక భారాన్ని భరిస్తూ పథకాన్ని అమలు చేసిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనా తీరును అధ్యయనం చేయడానికి బదులు, ఆయన పథకాలను రద్దు చేసేలా మంత్రి వ్యాఖ్యలు ఉన్నాయని పలువురు చర్చించుకుంటున్నారు. వాహనాలు కొనుగోలు చేయడంతో రూ.1500 కోట్ల నష్టం వాటిల్లిందంటూ చేసిన వ్యాఖ్యలు పూర్తిగా బాధ్యతారాహిత్యమని, ఎన్నికలకు ముందు జగన్ పథకాలన్నింటినీ కొనసాగిస్తామని కూటమి నేతలు హామీ ఇచ్చిన విషయం విదితమే. దీనిపై 50 రోజులకే యూటర్న్ తీసుకునే యత్నాలపై ప్రజలు పెదవి విరుస్తున్నారు.

**పథకాన్ని కొనసాగించాల్సిందే..**



"వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తానే కాదు, ఎవరు అధికారంలోకి వచ్చినా సంక్షేమ పథకాలను అమలు చేయాల్సిందేనన్న పద్ధతిలో వాటిని రూపొందించారు. ఇంటింటికీ రేషన్ సరకుల పంపిణీ పథకం ఎండీయూ నిర్వాహకులకు 2027 వరకూ కాంట్రాక్టు కొనసాగనుంది. పేదల సౌకర్యం కోసం ఈ పథకాన్ని కొనసాగించాల్సిందే."

– యర్రంశెట్టి నాగేశ్వరరావు, ఎంపీటీసీ, కేదారిలంక

**కరోనా సమయంలో..**

మండపేట, రామచంద్రపురం నియోజకవర్గాల్లోని 120 గ్రామాల్లో కరోనా వ్యాప్తి తీవ్రంగా ఉన్నప్పుడు ప్రజలు ఇంటికే పరిమితం కావాల్సి వచ్చింది. బయటకు రాకూడదన్న కఠిన నిబంధనల నేపథ్యంలో ఇంటింటికీ రేషన్ సరకుల పంపిణీ పథకం విశేషంగా ఉపకరించింది. పని కోల్పోయిన సామాన్యులకు రేషన్ సరకులే ఆసరా అయ్యాయి. పారదర్శకంగా సరకులు పంపిణీ చేసేందుకు లబ్ధిదారుని ఇంటికి వెళ్లి, ఎలక్ట్రానిక్ కాటాలోనే సరకులను తూకం వేసి అందజేశారు.

**వలంటీర్ల సహకారం**

గత ప్రభుత్వ పాలనలో వలంటీర్లు సంక్షేమం అమలులో విశేష కృషి చేశారు. కరోనా సమయంలో ఇంటింటికీ రేషన్ ఇవ్వాల్సి వచ్చినప్పుడు ఎండీయూ నిర్వాహకులు, రెవెన్యూ ఉద్యోగులకు తోడుగా వలంటీర్లు సహకారం అందించారు. ఇంటికి వెళ్లి లబ్ధిదారులకు సరకులను అందజేశారు.

### ఘనంగా అశిరాంబ అమ్మవారి తీర్థం



అమ్మవారి దర్శనానికి లైన్‌లో ఉన్న భక్తులు

**కపిలేశ్వరపురం:** అంగర గ్రామ దేవత అశిరాంబ అమ్మవారి తీర్థం సోమవారం ఘనంగా జరిగింది. తీర్థ మహోత్సవ నిర్వాహక కమిటీ నాయకుడు రాగం రామచంద్రరావు, భక్తుల పర్యవేక్షణలో ఆలయం వద్ద పటిష్ట ఏర్పాట్లు చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారు. గ్రామోత్సవంలో అమ్మవారికి మొక్కులు తీర్చుకున్నారు. అంగర, పడమర ఖండ్రిక గ్రామాల్లోని విద్యాలయాలకు సెలవు ప్రకటించడంతో ఆలయం వద్ద సందడి నెలకొంది.

### భక్తిశ్రద్ధలతో హజరత్ ఇమామ్ హుస్సేన్ దహోమ్



ద్రాక్షారామలో నిర్వహిస్తున్న హజరత్ ఇమామ్ హుస్సేన్ దహోమ్

**రామచంద్రపురం రూరల్:** మండలంలోని ద్రాక్షారామలో అజుఖానే జహరా పంజాలో హజరత్ ఇమామ్ హుస్సేన్ దహోమ్ భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. 1980 నుంచి ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. మండపేటకు చెందిన గులామ్ అబ్బాస్ దీనిని ప్రారంభించగా, దానిని వారి కుటుంబ సభ్యులు కొనసాగిస్తున్నారు. ఇరాన్ నుంచి షియా మత గురువు మౌలానా డాక్టర్ సయ్యద్ షమీం రజు రిజ్వీ ప్రత్యేకంగా హాజరై మజ్లిస్‌లు చదివారు. అనంతరం షియా ముస్లింలు జులూస్ మాతమ్ చేసి హజరత్ ఇమామ్ హుస్సేన్‌కు ఘనంగా నివాళులు అర్పించారు. ద్రాక్షారామలో మాత్రమే ప్రత్యేకంగా నిర్వహించే ఈ కార్యక్రమానికి ద్రాక్షారామ, పరిసర గ్రామాలతో పాటు తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు, ఒడిశా తదితర రాష్ట్రాల నుంచి షియా ముస్లింలు అధిక సంఖ్యలో హాజరయ్యారు.

## వరదపై అప్రమత్తంగా ఉండాలి



నారాయణలంక కాజ్‌వే వద్ద వరద పరిస్థితిపై అధికారులతో చర్చిస్తున్న ఆర్డీఓ సుధాసాగర్

**రామచంద్రపురం ఆర్డీఓ సుధాసాగర్**

**కపిలేశ్వరపురం:** గోదావరి నది ఉధృతంగా ప్రవహిస్తున్న నేపథ్యంలో మండలంలోని నదీ పరివాహక గ్రామాల అధికారులు అప్రమత్తంగా ఉండాలని రామచంద్రపురం ఆర్డీఓ సుధాసాగర్ ఆదేశించారు. మండలంలోని కపిలేశ్వరపురం గ్రామ శివారు నారాయణ లంకను సందర్శించారు. స్థానిక వరద పరిస్థితులను తహసీల్దార్ రాజరాజేశ్వరి, లంక గ్రామాల్లో విధులు నిర్వహిస్తున్న పలు శాఖల అధికారులు వివరించారు. గ్రామ శివారుల్లో నీరు నిలిచి ఉన్నందున నిరంతరం ప్రజల ఆరోగ్య పరిస్థితులపై అప్రమత్తంగా ఉండాలని ఆర్డీఓ ఆదేశించారు. ప్రభుత్వ శాఖల అధికారులు సమన్వయంతో వ్యవహరించాలన్నారు.

**ఎమ్మెల్యే పర్యటన**

మండలంలోని అద్దంకివారి లంక, పల్లపు లంక గ్రామాల్లో సోమవారం ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వర రావు పర్యటించారు. అధిక వర్షాలు, వరదల కారణంగా ఆయా గ్రామాల్లో జనజీవనం స్తంభించింది. స్థానిక పరిస్థితులను తహసీల్దార్ రాజరాజేశ్వరి, కార్యదర్శి సీహెచ్ నరసింహారావు వివరించారు. వరద తగ్గుముఖం పట్టేవరకూ ప్రజలకు తోడుగా నిలవాలని అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. ఆయన వెంట సర్పంచ్‌లు నాతి గవరయ్య, దాయం కావేరి, మాజీ ఎంపీటీసీ గాలిదేవర వసంతరాయుడు, మలకా రామకృష్ణ ఉన్నారు.



అద్దంకివారి లంకలో వరదను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

## తెగిన విద్యుత్ తీగలు

**మలికిపురం:** సబ్‌స్టేషన్ రోడ్‌లో ఆదివారం రాత్రి కొబ్బరి చెట్టు పడిపోవడంతో విద్యుత్ స్తంభాలు విరిగిపోయి వైర్లు చెల్లాచెదురుగా పడిపోయాయి. దీంతో స్థానికులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. నిత్యం రద్దీగా ఉండే ఈ సెంటర్లో ప్రమాదం జరగకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. సాలిపేట ఏరియాలో ఈ సంఘటన జరిగిన వెంటనే భూపతివారిపేట యూత్ సాయంతో విద్యుత్ సిబ్బంది సరఫరాను పునరుద్ధరించారు.



మలికిపురంలో కూలిన విద్యుత్ స్తంభం

## హాస్టల్ విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలి

**పీడీఎస్‌యూ నేత సిద్ధూ**

**రామచంద్రపురం:** ప్రభుత్వ సంక్షేమ హాస్టళ్లలోని విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని పీడీఎస్‌యూ రాష్ట్ర సహాయ కార్యదర్శి సిద్ధూ కోరారు. పట్టణంలోని ఎస్సీ బాలుర అంబేడ్కర్ వసతి గృహాన్ని తక్షణమే మార్చాలని, ఎస్సీ, బీసీ సంక్షేమ వసతి గృహాల్లో విద్యార్థుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో ఏఓకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా సిద్ధూ మాట్లాడుతూ పేద విద్యార్థులకు ఉత్తమ విద్యతో పాటు, వసతి సౌకర్యం కల్పించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం సంక్షేమ హాస్టళ్లను ఏర్పాటు చేసిందన్నారు. పాలకుల నిర్లక్ష్యం, అధికారుల పర్యవేక్షణ లోపంతో సంక్షేమ హాస్టళ్లు సమస్యలకు నిలయాలుగా మారాయన్నారు. నియోజకవర్గంలో డజనుకు పైగా ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమ హాస్టళ్లున్నాయని వివరించారు. రామచంద్రపురం, హసన్‌బాద హాస్టల్ భవనాలు శిథిలావస్థకు చేరాయని, దశాబ్దాల క్రితం నిర్మించిన భవనాల్లోనే నేటికీ వసతి గృహాలను కొనసాగించడం దారుణమన్నారు. ఎప్పుడు కూలుతాయోనని భయం గుప్పిట్లో విద్యార్థులు కాలం వెళ్లదీస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల రామచంద్రపురం ఎస్సీ బాయ్స్ అంబేడ్కర్ కాలేజీ హాస్టల్, హైస్కూల్ బాలురు వసతి గృహంలో వర్షాలకు గోడలు, శ్లాబ్‌ల పెచ్చులూడి పడ్డాయన్నారు. కొన్ని చోట్ల అద్దె భవనాల్లోనే కొనసాగుతున్నాయని చెప్పారు. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా గదులు, మరుగుదొడ్లు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. పలుచోట్ల వార్డెన్లు లేక పర్యవేక్షణ కొరవడడంతో, మెనూ సక్రమంగా పాటించడం లేదన్నారు. అపరిశుభ్రత, నాసిరకం సామగ్రితో విద్యార్థులు అనారోగ్యానికి గురవుతున్నారన్నారు. దోమలు, ఈగలతో విద్యార్థులు సహవాసం చేస్తున్నారని విచారం వ్యక్తం చేశారు. వెంటనే పాడైన భవనాల స్థానే కొత్తవి నిర్మించాలని డిమాండ్ చేశారు. పెరిగిన ధరల మేరకు మెస్, కాస్మొటిక్ చార్జీలు పెంచాలని, పాత బకాయిలు చెల్లించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సంఘ రామచంద్రపురం డివిజన్ నాయకులు కర్రిపోతుల నవీన్‌కుమార్, కె.సుధీర్‌బాబు, పి.వీరబాబు, వై.సతీష్ రాజ్‌కుమార్, తిరుమల సత్యసాయి, టి.చందు తదితరులు పాల్గొన్నారు.



ఏఓకు వినతిపత్రం ఇస్తున్న సిద్ధూ తదితరులు

## అక్కరకు రాని 108

**కాజులూరులో ఉంచాలని స్థానికుల డిమాండ్**

**కాజులూరు:** అత్యవసర సమయాల్లో రోగులకు, క్షతగాత్రులకు ప్రాణ ప్రదాయిని అయిన 108 అంబులెన్స్ నేటికీ విశేష సేవలందిస్తోంది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఆనాడు మహానేత వైఎస్సార్ ప్రవేశపెట్టిన ఈ పథకాన్ని ఇతర రాష్ట్రాలు ఆదర్శంగా తీసుకున్నాయి. 2019లో వైఎస్సార్ తనయుడు, అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మండలానికి ఒక అంబులెన్స్‌ను ఏర్పాటు చేశారు. అయితే ఇటీవల 108 అంబులెన్స్‌ను మండల కేంద్రమైన కాజులూరులో కాకుండా,, మండలానికి ఓ మూలన ఉండే గొల్లపాలెంలో ఉంచారు. దీంతో ప్రజలకు అంతగా ఉపయోగంలో లేకుండా పోయిందని స్థానికులు చెబుతున్నారు. మండలంలో 26 గ్రామాలుండగా, మండల కేంద్రమైన కాజులూరు దాదాపుగా అన్ని గ్రామాలకు కేంద్రంగా ఉంది. గతంలో ఈ వాహనం కాజులూరు మండల పరిషత్ కార్యాలయంలో ఉండేది. ఏ మారుమూల గ్రామంలో ప్రజలకు ఇబ్బందులు వచ్చినా 15 నిమిషాల వ్యవధిలో 108 అంబులెన్స్ అక్కడకు చేరుకుని క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించేది. ప్రస్తుతం ఈ వాహనాన్ని గొల్లపాలెం పీహెచ్‌సీ ఆవరణలో ఉంచారు. దీంతో కుయ్యేరు, ఉప్పుమిల్లి, ఒంటితాడి వంటి మారుమూల గ్రామాల ప్రజలకు ఇది అందుబాటులో లేకుండా పోయింది. ఆదీకాకుండా కాకినాడ-కోటిపల్లి రహదారిని ఆనుకుని గొల్లపాలెం ఉంది. గొల్లపాలెం పరిసర గ్రామాల ప్రజలకు ఏ ఇబ్బందులు తలెత్తినా వందలాది సంఖ్యలో ప్రైవేటు వాహనాలు అందుబాటులో ఉంటాయి. పలు మారుమూల గ్రామాలలో అత్యవసర పరిస్థితులు ఏర్పడితే క్షతగాత్రులు సొమ్ము చెల్లించేందుకు సిద్ధపడినా, ప్రైవేటు వాహనాలు అందుబాటులో ఉండవని స్థానికులు వాపోతున్నారు. ఈ విషయంపై బీజేపీ నేత దూడల శంకరనారాయణ మూర్తి ఇటీవల రాజమహేంద్రవరం వచ్చిన రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రికి వినతిపత్రం సమర్పించారు. అయినప్పటికీ పరిస్థితిలో మార్పు రాలేదు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి 108 అంబులెన్స్‌ను మండలంలోని అన్ని గ్రామాల ప్రజలకు అందుబాటులో ఉండేలా కాజులూరులో ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.




గొల్లపాలెం పీహెచ్‌సీ ఆవరణలో ఉన్న 108 అంబులెన్స్

### స్టూడెంట్ కిట్ల పంపిణీ



విద్యార్థులకు కిట్లను పంపిణీ చేస్తున్న నాయకులు

**కాజులూరు:** మండలంలోని పలు గ్రామాల్లో ఉన్న పాఠశాలల్లో విద్యార్థులకు సోమవారం స్టూడెంట్ కిట్లు పంపిణీ చేశారు. మంజేరు పాఠశాలలో బీజేపీ నాయకులు సలాది వీరవెంకట సత్యనారాయణ, పుణ్యమంతుల శివాజీ ఆధ్వర్యంలో కిట్లు అందజేశారు. అలాగే కుయ్యేరు, అయితపూడి అండ్రంగి తదితర గ్రామాల్లో విద్యార్థులకు స్టూడెంట్ కిట్లు పంపిణీ చేశారు.

### పంట కాలువలో మృతదేహం

**కొత్తపేట:** మండలంలోని గంటి వద్ద పి.గన్నవరం ప్రధాన పంట కాలువలో గుర్తు తెలియని మృతదేహం గుర్తించినట్టు స్థానిక ఎస్సై ఎం.అశోక్ తెలిపారు. దీనికి సంబంధించి ఎస్సై తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గంటి లంకపేట వద్ద సుమారు 40 నుంచి 45 ఏళ్ల వయసు ఉన్న గుర్తుతెలియని పురుషుని మృతదేహం నీటిలో తుప్పలకు అడ్డుకొని ఉండగా, గంటి వీఆర్‌ఓ పోలీసులకు సమాచారం అందించారు. మృతదేహంపై ముదురు గోధుమ రంగు నిలువు చారల చొక్కా, ముదురు సిమెంట్ రంగు ప్యాంటు ఉన్నాయి. వీఆర్‌ఓ ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు. మృతదేహానికి సంబంధించి ఎవరికైనా ఆచూకీ తెలిస్తే సెల్ నంబర్ 94409 04842 లేదా 08855 243333కు ఫోన్ చేయాలని కోరారు.

### సముద్రపు ఒడ్డున మృతదేహం లభ్యం

**అల్లవరం:** మండలంలోని ఓడలరేవు సముద్ర తీరం నదీ సంగమం వద్ద వ్యక్తి మృతదేహాన్ని అల్లవరం పోలీసులు గుర్తించారు. మృతుడు రాజోలు గ్రామానికి చెందిన సానబోయిన సత్యనారాయణ(69)గా గుర్తించారు. ఈ నెల 25వ తేదీన పి.గన్నవరంలోని బంధువుల ఇంటికి వెళ్లిన సత్యనారాయణ ప్రమాదవశాత్తు కాలు జారి గోదావరిలో పడిపోయాడు. ఆదివారం ఓడలరేవు సముద్ర తీరంలో మృతదేహం ఉన్నట్టు పోలీసులకు సమాచారం అందింది. పోలీసులు అక్కడకు చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై హరీష్ కుమార్ తెలిపారు.

# భావి భవితకై.. అంతా ఒక్కటై..



పాఠశాలలో సహపంక్తి భోజనాల్లో పాల్గొన్న విద్యార్థులు, తల్లిదండ్రులు

**నేటితో ముగిసిన శిక్షా సప్తాహ్**

**రాయవరం:** నూతన జాతీయ విద్యా విధానం అమల్లోకి తీసుకొచ్చి నాలుగేళ్లు పూర్తయిన సందర్భంగా పాఠశాలల్లో వారం రోజులుగా అమలు చేసిన శిక్షా సప్తాహ్ ప్రత్యేక కార్యక్రమాలు సోమవారంతో ముగిశాయి. ఈ నెల 22 నుంచి జిల్లావ్యాప్తంగా పాఠశాలల్లో శిక్షా సప్తాహ్ పేరుతో రోజు వారీ ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించారు. పాఠశాల విద్యా శాఖ, సమగ్ర శిక్షా సంయుక్తంగా ఆయా కార్యక్రమాలను పర్యవేక్షించింది. నూతన విద్యా విధానం అమలై నాలుగు వసంతాలు పూర్తి చేసుకున్నందుకు ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించారు. ఈ నెల 22న స్థానిక వనరులతో తయారు చేసిన బోధనాభ్యసన సామగ్రిని ప్రదర్శించగా, 23న భాష, గణితంపై విద్యార్థులు పట్టు సాధించేందుకు పునాది అభ్యసనం, 24న విద్యార్థుల్లో శారీరక సౌష్టవ ప్రాధాన్యాన్ని తెలియజేసేందుకు గ్రామీణ క్రీడలను ప్రోత్సహించడం, 25న విద్యార్థుల్లో భిన్నత్వంలో ఏకత్వం భావాన్ని చాటి చెప్పేందుకు ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. 26న డిజిటల్ ఎడ్యుకేషన్‌ను ప్రోత్సహించేందుకు సాంకేతిక నైపుణ్యాల ప్రదర్శన, 27న పర్యావరణంపై అవగాహన పెంచేలా పర్యావరణ సంకల్ప యాత్ర నిర్వహించారు.

**శుభతిథి భోజనాలతో ముగింపు**

శిక్షా సప్తాహ్ కార్యక్రమాల ముగింపులో భాగంగా సోమవారం జిల్లావ్యాప్తంగా పాఠశాలల్లో శుభతిథి భోజనాలను ఏర్పాటు చేశారు. పాఠశాలల్లో మధ్యాహ్నం సహపంక్తి భోజనాలు ఏర్పాటు చేసి, విద్యార్థుల్లో సామాజిక భావోద్వేగ శ్రేయస్సు ప్రాధాన్యాన్ని వివరించారు. స్థానికులు, దాతల సహకారంతో ప్రత్యేక వంటకాలను విద్యార్థులకు వడ్డించారు. విద్యార్థులతో పాటు, పెద్దలు, ఉపాధ్యాయులు సహపంక్తి భోజనం చేశారు. జిల్లావ్యాప్తంగా 1,578 ప్రభుత్వ, ప్రభుత్వ యాజమాన్య పాఠశాలల్లో శిక్షా సప్తాహ్ కార్యక్రమాలను నిర్వహించగా, శుభతిథి భోజనాలను డీఈఓ ఎం.కమల కుమారి, సమగ్ర శిక్షా ఏపీసీ ఎ.మధుసూదనరావు, డీవైఈఓలు శ్రీపాద నరసింహఫణి, జి.సూర్యప్రకాశరావు, సమగ్ర శిక్షా సెక్టోరల్ అధికారులు పర్యవేక్షించారు.

## పాఠశాలలో సహపంక్తి భోజనాలు

**రామచంద్రపురం రూరల్:** శిక్షా సప్తాహ్ కార్యక్రమంలో భాగంగా సామాజిక భాగస్వామ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని కాపవరం జెడ్పీ హైస్కూల్‌లో సోమవారం సహపంక్తి భోజనాలు నిర్వహించారు. ఎంపీటీసీ రెడ్నం సతీష్ విద్యార్థులకు ఆరోగ్యకర ఆహారంపై వివరించారు. అనంతరం విద్యార్థులు, ఉపాధ్యాయులు, స్థానిక నాయకులతో కలసి సహపంక్తి భోజనాలు చేశారు. హెచ్‌ఎం ముమ్మిడి సత్యనారాయణ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సర్పంచ్ యనమదల మంగాదేవి, ఉప సర్పంచ్ కొల్లపు రాజేశ్వరి, వార్డు సభ్యులు దంగేటి లోవరాజు, ముద్రగడ వీరబాబు, సామాని జయలక్ష్మి, డీసీసీబీ మాజీ డైరెక్టర్ చిలుకూరి విశ్వేశ్వరరావు, పాఠశాల పేరెంట్స్ కమిటీ చైర్మన్ మత్తి లక్ష్మీమణిమాల తదితరులు పాల్గొన్నారు.



కాపవరం స్కూల్‌లో చేస్తున్న సహపంక్తి భోజనాలు